క్లుప్తంగా

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామపూజలు, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

దర్శి: అధికశ్రావణ మాస ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం రాత్రి శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణం ఆర్యవైశ్య మహిళలచే నిర్వహించారు. ఆలయ కమిటీ టీచర్ సుబ్బారావు దంపతులు, పరుచూరి సాయి దంపతులు పాల్గొన్నారు. మునగా లక్ష్మీకుమారి, అత్తులూరి సుజాత, సముద్రాల రామలక్ష్మి, తల్లాకుల లక్ష్మి,సముద్రాల సీత, ఒగ్గు లక్ష్మీసుచరితలచే గానామృతం చేశారు. కమిటీ సభ్యులు చీదెళ్ల బసవయ్య, చందలూరి కొండయ్యశెట్టి, మునగా శివప్రసాద్, ఆర్యవైశ్య భక్తులు పాల్గన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



రాచర్లలో పీర్ల గ్రామోత్సవాన్ని తిలకిస్తున్న ఎస్సై కృష్ణపావని

రాచర్ల: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎస్సై జి.కృష్ణపావని అన్నారు. మండలంలోని గౌతవరం, రాచర్ల, అనుమలవీడు గ్రామాల్లో నిర్వహించుకునే మొహర్రం పండుగ వేడుకలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. అనంతరం రాచర్ల గ్రామంలోని షహదత్ (పీర్ల పండుగ) చివరిరోజు కావడంతో పీర్ల గ్రామోత్సవాన్ని తిలకించారు.

రూ.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు



నిర్మాణంలో ఉన్న గ్రావెల్ రోడ్డు

మార్కాపురం టౌన్: పట్టణంలోని 16వ బ్లాక్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలతో అంతర్గత రహదారి దెబ్బతిన్న విషయాన్ని కౌన్సిలర్ దారివేముల హర్షిత ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణతో మాట్లాడి మున్సిపల్ సాధారణ నిధుల నుంచి 5 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. దీంతో కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఆదివారం పనులు ప్రారంభించారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యేతోపాటు చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఓబులక్కపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: మండలంలోని మాదాలవారిపాలెం సచివాలయం పరిధిలోని ఓబులక్కపల్లిలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

కులమతాలకు అతీతంగా

మొహర్రం వేడుకలు



బేస్తవారిపేట: పీర్లతో గ్రామోత్సవం



కొండేపల్లిలో పీర్ల ఊరేగింపు

కొనకనమిట్ల: మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్దవరం, మునగపాడు, నాగంపల్లి, నాగరాజుకుంట, గనివానిపాడు, నాయుడుపేట, చినారికట్ల గ్రామాలలో గుండాలు ఏర్పాటు చేసి పీర్లను ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించి భక్తిని చాటుకున్నారు. వెలుగొండ్రాయునిపల్లి గ్రామంలో ఒంగోలు బాలు డ్యాన్స్ జోన్ అకాడమీ చిన్నారులు ధనశ్రీ, జ్యోస్నశ్రీ, మోక్ష సాయిశ్రీ, దీక్షిత, భవాని ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి.



పెద్దదోర్నాలలో పీర్ల ఊరేగింపులో భక్తులు

ఘనంగా మొహర్రం వేడుకలు

మార్కాపురం రూరల్: పవిత్ర మొహర్రం పండుగను పురస్కరించుకుని మండలంలోని కొండేపల్లి, వేములకోట, నికరంపల్లి, గజ్జలకొండ గ్రామాల్లో ఆదివారం పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ధర్మ పరిరక్షణ కోసం అశువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ముస్లింలు ఉపవాసదీక్ష ఆచరించారు. ప్రార్థనల అనంతరం దర్గాలో కొలువైన పీర్లను బయటకుతీసి గుండంలో నడుచుకుంటూ వెళ్లారు. సుందరంగా ముస్తాబు చేసిన పీర్లను ముజావర్ల ఆధ్వర్యంలో ఊరేగించారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల నిమజ్జనం

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లచావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. పీర్లతో అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. బేస్తవారిపేట, పాపాయిపల్లెలో సాయంత్రం మేళతాళాలతో కనుల పండువగా గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనం కోసం తరలించారు. సోమవారిపేట సమీపంలోని చీతిరేల కతువ వద్ద నిమజ్జనం కార్యక్రమం చేశారు.



వెలుగొండ్రాయునిపల్లిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో పీర్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడి వద్దకు భక్తులు భారీగా చేరుకుని మొక్కులు చెల్లించారు. భక్తులు నిప్పుల గుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు.

నిశ్చితార్థ వేడుకలో బాలినేని



తాళ్లూరు(ముండ్లమూరు): సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి కుమారుడు శివశంకర్‌రెడ్డి నిశ్చితార్థ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరై ఆశీర్వదించారు. తాళ్లూరులో రమణారెడ్డి నివాసంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి వేర్వేరుగా హాజరై కాబోయే దంపతులకు ఆశీస్సులందించారు. మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఎడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంకనాగార్జునరెడ్డి, కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, సర్పంచ్‌లు చార్లెస్ సర్జన్, సుమలతాశ్రీకాంత్ రెడ్డి, వలి, గంగిరెడ్డిపాలెం యలమందారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సమన్వయంతో పనిచేస్తే మంచి పేరు

దర్శి: అందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎంపీపీ సుధారాణి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులు వారు చేసినపనులను గురించి ఎంపీడీఓ కుసుమకుమారి ప్రస్తావించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ వలంటీర్ ద్వారా ప్రజల చెంతకు చేర్చడం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. నాడు నేడు ద్వారా పాఠశాలలకు రూపు రేఖలు మార్చడమే కాక విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నారని పేర్కొన్నారు.

ఎంపీపీ ఆగ్రహం

తనకు ఎటువంటి సమాచారం లేకుండా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై ఎంపీడీఓ కుసుమకుమారిపై ఎంపీపీ సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ఎంపీపీ అని తనను చిన్న చూపు చూస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా తాను ముందస్తుగానే ఏఓ సమక్షంలో సంప్రదించి సమాచారం ఇచ్చానని, ఆ తర్వాతే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నుంచి ఎంపీపీ బైటకి వెళ్లి దళిత సంఘాల నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలియజేశారన్నారు. మరలా తిరిగి వచ్చి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారన్నారు. వైస్ ఎంపీపీలు సోముదుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుసుమకుమారి

బ్రాహ్మణులు పథకాలు వినియోగించుకోవాలి

- బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ జిల్లా మేనేజర్ రాధాకృష్ణ

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు అనుబంధంగా ఉన్న బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలని జిల్లా బ్రాంచ్ మేనేజర్ కేవీ రాధాకృష్ణ సూచించారు. ఆదివారం పట్టణంలోని శివాలయంలో సంఘ గౌరవ అధ్యక్షులు గోపాలుని హరిహరరావు ఆధ్వర్యంలో మార్కాపురం ప్రాంత బ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారు ఎవరైనా సొసైటీలో సభ్యులుగా చేరవచ్చన్నారు. అరుంధతీ రుణ పథకం ద్వారా మహిళలు గ్రూపుగా ఏర్పడి రూ.1.50 లక్షలు, వశిష్ఠ రుణ పథకం కింద పురుషులు గ్రూపుగా ఏర్పడి రూ.1.50 లక్షల రుణం పొందవచ్చని చెప్పారు. అర్చక మిత్ర పథకం కింద దేవదాయశాఖలో పనిచేస్తున్న అర్చకులు రూ.10 లక్షల వరకె రుణం పొందవచ్చని తెలిపారు. పురోహిత మిత్ర పథకం ద్వారా నలుగురు పురోహితులు గ్రూపుగా ఏర్పడి రూ.3.20 లక్షలు రుణం తీసుకోవచ్చన్నారు. బ్రాహ్మణ ఉద్యోగులు రూ.10 లక్షల వరకు రుణం తీసుకోవచ్చని తెలిపారు. ఉన్నత విద్య కోసం రూ.40 లక్షలు లోన్ పొందవచ్చన్నారు. జర్నలిస్టులు రూ.50 వేలు, ప్రైవేటు ఉపాధ్యాయులు రూ.50 వేలు రుణంగా తీసుకోవచ్చన్నారు. అనంతరం రాధాకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ కేశవరావు, లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్త అర్జునరావు, సాయిబాబా మందిర కోశాధికారి నాగరాజు, ఎక్స్ ఆర్మీ సంఘ కార్యదర్శి సాయి, గోపాలుని రమేష్‌బాబు, యండ్రపల్లి ప్రసాద్, ఆర్ఐ బి.రమణ, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సోమయాజులు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



రాధాకృష్ణను సన్మానిస్తున్న హరిహరరావు తదితరులు

ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి రూరల్: ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తీసివేతలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి సూచించారు. ఆదివారం పొదిలి–దర్శి రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుట్రలు చేసే అవకాశం ఉందని, వైఎస్సార్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా ఇంటింటి సర్వే సమయంలో బూత్ లెవెల్ ఏజెంట్లు బీఎల్ఓలతో కలిసి వెళ్లాలన్నారు. అక్కడ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు గమనించాలన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండేవారికి నూతనంగా ఓటు హక్కు కల్పించాలని చెప్పారు. సర్పంచ్‌లు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బూత్ లెవెల్ ఏజెంట్లకు శిక్షణ ఇస్తున్న నాయకులు

రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మంత్రి సురేష్, పక్కన ఎమ్మెల్యేలు నాగార్జునరెడ్డి, వరప్రసాద్

మార్కాపురం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం మార్కాపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దారవీడు మండలం బద్వీడు చెర్లోపల్లి గ్రామానికి చెందిన కె.నవీన్‌కు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మార్కాపురం, నెల్లూరు జిల్లా గూడూరు ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, వి.వరప్రసాద్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిని కలిసిన జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి



బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగమల్లేశ్వరరెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదివారం ఒంగోలు వచ్చిన సందర్భంగా తాళ్లూరు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డితో పాటు నాగమల్లేశ్వరరెడ్డి కలిసి సత్కరించారు.

ఫుట్‌బాల్ అండర్-13కు 10 మంది ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మార్కాపురం టౌన్: స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో ఆదివారం జిల్లా ఫుట్‌బాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ అండర్-13 సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. మార్కాపురం రాయల్ స్పోర్ట్స్‌కు చెందిన 30 మంది పాల్గొనగా 10 మంది ఎంపికైనట్లు ప్రెసిడెంట్ కె.రహ్మతుల్లా తెలిపారు. ఎంపికైన వారిలో జస్వంత్, భవేష్, నవనీత్, అనీష్, నాగసాయి, దినేష్, కుశల్, రాకేష్, అజయకుమార్‌రెడ్డి, నితీష్, సాయి యదునందన్ ఉన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచిపేరు తేవాలని స్పోర్ట్స్ సెక్రటరీ రమేష్‌బాబు సూచించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరిలో సంతోషం



ఎమ్మెల్యేలు కేపీ, వరప్రసాద్, జంకె వెంకటరెడ్డితో వెన్నా హనుమారెడ్డి దంపతులు

- ఎమ్మెల్యేలు కేపీ, వరప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని నెల్లూరు జిల్లా గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మార్కాపురంలో ఒక ప్రైవేటు వైద్యశాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే వరప్రసాద్ తొలుత మంత్రి సురేష్‌తో భేటీ అయ్యారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో కలిసి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి స్వగృహాలకు వచ్చి ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర, పార్టీ నాయకులు పత్తి వెంగన్న, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

పోలేరమ్మ తల్లికి పూజలు



మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి



పూజలందుకుంటున్న పోలేరమ్మ, పోతురాజు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లి పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

పోలేరమ్మకు పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు దక్షిణంపల్లిలో ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మతల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. కుంకుమ బండ్లు కట్టి ఉత్సవంగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు చెల్లించారు. ముందుగా అమ్మవారి కళశంను గ్రామంలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో మహిళలు నైవేద్యాలు సమర్పించారు.

అనుమలవీడులో కొండచిలువ

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామంలో షేక్ పల్నాటి మహబూబ్‌పీరా నివాసం సమీపంలో ఉన్న వరి గడ్డి వామి వద్ద ఆదివారం వేకువజామున 4 గంటల సమయంలో కొండచిలువ కనిపించింది. పక్కనే ఉన్న పొలం నుంచి వరిగడ్డి వామిలోకి వచ్చినట్లు తెలుస్తోంది. వరిగడ్డి వామిలోకి వెళ్తున్న కొండచిలువను గమనించిన వెంటనే తుడిమెళ్ల ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మధుప్రియాంకకు సమాచారం అందించారు. నలుగురితో కూడిన ఫారెస్టు రిస్క్ టీమ్ వెంటనే అనుమలవీడు చేరుకుని వరిగడ్డివామితో పాటు పక్కనే ఉన్న జొన్నచొప్పను తొలగించారు. జొన్నచొప్ప కింద ఉన్న 18 అడుగుల కొండచిలువను రిస్క్ టీమ్ పట్టుకుని సంచిలో బంధించి తరలించారు. కొండచిలువను అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు రిస్క్ టీమ్ సభ్యులు షేక్ మౌలాలి, రంగారెడ్డి, అశోక్, ప్రసాద్, శివ తెలిపారు.



కొండచిలువను బంధిస్తున్న ఫారెస్టు రిస్క్ టీమ్

ముగిసిన సాయి చరిత్ర సప్తాహ పారాయణం



పెద్దదోర్నాలలో గ్రామోత్సవంలో పాల్గొన్న సాయి భక్తులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని షిరిడీ సాయి మందిరంలో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభమైన సాయి సత్చరిత సప్తాహ పారాయణ ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. ఖమ్మం జిల్లా మర్లపాడుకు చెందిన ద్వారకామయి చిల్డ్రన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డు నుంచి నటరాజ్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.